కూటమి సర్కారు కొర్రీ

- కొందరికే పెట్టుబడి సాయం
- ఆందోళనలో 'అన్నదాత సుఖీభవ' వర్తించని రైతులు
- గతేడాది రూ.170 కోట్లు ఎగ్గొట్టిన చంద్రబాబు ప్రభుత్వం
- వైఎస్సార్‌సీపీ హయాంలో ఏడాదికి 1,52,232 మందికి లబ్ధి


అకాల వర్షాలకు గతేడాది హెచ్చెల్సీ ఆయకట్టులో దెబ్బతిన్న వరి


ఆశించిన స్థాయి దిగుబడి లేక పత్తి పంటను తొలగిస్తున్న రైతు

రాయదుర్గం: ఎన్నికల హామీలు అమలు చేయడంలో ఆచితూచి అడుగులు వేస్తున్న కూటమి సర్కారు.. అర్హులకు అన్నదాత సుఖీభవ వర్తింపజేయడంలోనూ మొండిచేయి చూపింది. కొందరికే పెట్టుబడిసాయం అన్నట్లు.. 14 నెలలుగా పథకం అమలు చేయకుండా నాన్చుతూ.. ఎట్టకేలకు రెండు రోజులక్రితం కేంద్ర సహాయం కలుపుకొని బాబు ప్రభుత్వం విడుదల చేసిన మొత్తంలోనూ చాలా మందిని ఊరించి, ఉసూరుమనిపించింది. జాబితాలో పేర్లు లేక, ఖాతాలో నగదు జమ కాక రైతులు అయోమయంలో పడ్డారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో ఏడాది కాలంగా రూ.170 కోట్లకు పైగా మొదటి విడత పెట్టుబడి సాయం రైతుల ఖాతాల్లో జమ కాక నష్టపోవాల్సి వచ్చింది. రెండేళ్ల తర్వాత అందుబాటులోకి తెచ్చిన జాబితాలోనూ అలాంటి పరిస్థితుల్నే చవిచూడాల్సి వస్తోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అర్హత ఉంటే చాలు.. ప్రతి రైతుకూ వైఎస్సార్ రైతు భరోసా పథకం వర్తించింది. ఏడాదికి 1,52,232 మంది రైతు ఖాతాల్లోకి రూ.173.28 కోట్ల మొత్తాన్ని జమ చేసింది. ఐదేళ్ల పాటు కనీవినీ ఎరుగని రీతిలో 7,35,353 మంది రైతులకు రూ.958.04 కోట్లు కేవలం పెట్టుబడి సాయంగా నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించారు. ప్రస్తుత ప్రభుత్వం పీఎం కిసాన్ కలుపుకొని రూ.168.94 కోట్లను 1,40,808 రైతు ఖాతాల్లోకి జమ చేసింది. గత ప్రభుత్వంతో పోలిస్తే 11,424 మంది రైతులకు రూ.4.34 కోట్లు దూరమైంది. రైతు ఖాతాకు ఆధార్ అనుసంధానం కాకపోవడం, రీ-సర్వే లో జరిగిన కొన్ని తప్పిదాల కారణంగా చాలా మంది నగదు కోల్పోవాల్సి వచ్చింది.

రూ.26 వేలు ఇస్తామన్నారు..

సూపర్‌సిక్స్ హామీల్లో ప్రధానంగా చెప్పుకునే అన్నదాత సుఖీభవ పథకం ఆది నుంచి అటకెక్కింది. కేంద్రం ఇచ్చే పీఎం కిసాన్ కలుపుకొని ఏటా రూ.26 వేల పెట్టుబడి సాయం ప్రకటించారు. ఊరు, వాడా ఎన్నికల్లో ప్రచారం చేశారు. తీరా చూస్తే దాన్ని రూ.20 వేలకే పరిమితం చేయడంతో కౌలు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. వైఎస్సార్‌సీపీ హయాంలో యజమానితో సంబంధం లేకుండా కౌలు రైతులందరికీ పెట్టుబడి సాయం అందించారు. ప్రస్తుత కూటమి సర్కార్ ఆగస్టు వచ్చినా కౌలు రైతులకు కార్డులు జారీలోనూ తాత్సారం చేస్తున్నారు. దీంతో చాలా మంది రైతులు సుఖీభవ పథకం వర్తించలేదు.

సుఖీభవలో ఎందుకీ కోత



రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోనూ వేలాది మంది రైతులకు సుఖీభవ వర్తించలేదు. చంద్రబాబు ఏడాది పాలన ఆర్భాటం తప్పా అమలు కాలేదు. జగనన్న హయాంలో రైతు భరోసాకు అదనంగా కేంద్ర నిధులతో సంబంధం లేకుండా అన్నదాత సుఖీభవ పేరుతో రూ.26 వేలు ఇస్తామన్నారు. తాజా పరిస్థితులు చూస్తే కేంద్రం వాటా కలుపుకొని రైతుకు జమ చేశారు. సీఎం చంద్రబాబు నైజం ఎలాంటిదో రైతులందరికీ తెలుసు. అర్హత ఉన్న ప్రతి రైతుకూ న్యాయం చేయాలి. త్వరలో గ్రీవెన్స్ అందుబాటులోకి తీసుకొచ్చి దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించాలి. లేకుంటే బాధిత రైతులతో కలసి వ్యవసాయ కార్యాలయాలను ముట్టడిస్తాం. ప్రభుత్వ మెడలు వంచైనా రైతులకు న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తాం.

– మెట్టు గోవిందరెడ్డి, మాజీ ఎమ్మెల్యే, రాయదుర్గం

అన్నివర్గాలను మోసం చేసిన చంద్రబాబు

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి


కణేకల్లు: సూపర్‌సిక్స్ పథకాలపై అడిగి తెలుసుకుంటున్న సమన్వయకర్త మెట్టు

కణేకల్లు: అన్ని వర్గాలనూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మోసం చేస్తున్నారని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి మండిపడ్డారు. అధికారం కోసం చంద్రబాబు ఎన్నికల ముందు అలవిగాని హామీలిచ్చి అధికారం చేపట్టారన్నారు. ఆదివారం పూలచెర్ల, పుల్లంపల్లి గ్రామాల్లో 'బాబూ ష్యూరిటీ... మోసం గ్యారంటీ' కార్యక్రమం జరిగింది. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాటిల్ బ్రహ్మానందరెడ్డి, జెడ్పీ సభ్యురాలు డి.పద్మావతి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి కన్నారి ఉషారాణి, జిల్లా కోశాధికారి పాటిల్ నాగిరెడ్డి, కార్యదర్శి పాటిల్ చెన్నకేశవరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మారెంపల్లి మారెన్న, పూలచెర్ల సర్పంచు బోయ రవీ, స్థానిక నాయకులు రవిప్రకాష్‌రెడ్డి, పుల్లంపల్లి పెద్దిరెడ్డితో కలిసి మెట్టు బీసీ, ఎస్సీ కాలనీల్లో పర్యటించారు. ఇంటింటా వెళ్లి చంద్రబాబు ఇచ్చిన హామీలు నెరవేర్చారా? పథకాలన్నీ వస్తున్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. ఆడబిడ్డ నిధి కింద రూ.1500 రావడం లేదని, 50 ఏళ్ల వయస్సున్న తమకు పింఛన్ ఇవ్వలేదని మహిళలు.. నిరుద్యోగ భృతి ఇవ్వలేదని నిరుద్యోగులు మెట్టు గోవిందరెడ్డి దృష్టికి తెచ్చారు.

సంపాదనంతా తాగుడుకే సరిపోతోంది..

మా ఊళ్లో మొత్తం నాలుగు బెల్టు షాపులు ఉన్నాయని, తమ భర్తలు సంపాదనంతా తాగుడుకే తగలేస్తున్నారని మహిళలు మెట్టు గోవిందరెడ్డి వద్ద వాపోయారు. జగనన్న హయాంలో బెల్టుషాపులు లేవని గుర్తు చేశారు. చేతల కష్టమంతా తాగుడుకే ఖర్చవుతోందని కొందరు మహిళలు చెప్పగా.. బెల్టు షాపులతో అలవాటు లేనివారు కూడా అలవాటు చేసుకుంటున్నారని ఆవేదన చెందారు.

ఇంటింటా రేషన్ అందేది..

జగనన్న పాలనలో ఇంటింటా రేషన్ అందేదని, చంద్రబాబు ప్రభుత్వంలో పనులు మానుకొని స్టోర్ వద్ద క్యూలో ఉండి రేషన్ తీసుకురావాలంటే ఇబ్బందిగా ఉందని మహిళలు మెట్టు గోవిందరెడ్డికి తెలిపారు. క్యూలో నిలబడిన సమయంలో తోపులాటలో తన తల్లి గౌరమ్మ చేయి విరిగిపోయిందని కొడుకు శంకర్ ఆవేదన చెందాడు. ప్రతి నెలా కుస్తీ పట్టి రేషన్ తెచ్చుకుంటున్నామని, పైగా తుకాల్లోనూ తేడా ఉందని చెప్పారు. తమకు ఉచిత సిలిండర్ డబ్బులు పడలేదని గ్రామానికి చెందిన గంగమ్మ, శాంతమ్మ, లక్ష్మక్క, పెన్నక్క తెలిపారు.

చంద్రబాబువి డైవర్షన్ పాలటిక్స్..

చంద్రబాబు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోకుండా ప్రజల ఆలోచనలను మళ్లించడానికి ఎప్పటికప్పుడు డైవర్షన్ పాలటిక్స్ చేస్తున్నాడని సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ నేతలపై అక్రమ కేసులు బనాయిస్తూ డైవర్షన్ పాలటిక్స్ చేస్తున్నాడన్నారు. పేద, నిరుపేద ప్రజలకు వైఎస్సార్‌సీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, వారి తరఫున పోరాడి కూటమి సర్కారు హామీలను నెరవేర్చేలా చేస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు బోయ నాగరాజు, బషీర్, కాంట్రాక్టర్ రవి, ప్రభాకర్‌రెడ్డి, హంపి, సురేష్, దాదు, జయప్రకాష్, మహమ్మద్, మాజీ మండల కన్వీనర్ ఆలూరు చిక్కణ్ణ, కృష్ణారెడ్డి, చిన్న సర్మస్, చిక్కణ్ణ, కెంగుట రామిరెడ్డి, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గంటౌన్: రాయదుర్గం, మొలకాల్మూరులో ఆదివారం జరిగిన శుభకార్యాలకు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి హాజరయ్యారు. రాయదుర్గంలోని నేషనల్ ఫంక్షన్ హాలులో జరిగిన మంజునాయక్, విద్యాబాయి వివాహానికి, డి.హీరేహాళ్‌లో జరిగిన లోకేష్, తనూజ వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

'కూటమిది నియంత పాలన'

కూడేరు: కూటమి నేతలు నియంత పాలన సాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు మంజునాథ్ రెడ్డి విమర్శించారు. ఆదివారం కూడేరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో వారం రోజులుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహాలను సందర్శించినట్లు తెలిపారు. పరిశీలనలో మౌలిక వసతులు సరిగా లేకపోవడం, నాణ్యమైన భోజనం పెట్టకపోవడం, నాణ్యతలేని స్కూల్ బ్యాగులు పంపిణీ చేసినట్లు బయటపడిందన్నారు. సంక్షేమ వసతి గృహాల్లో వసతులు కల్పించకుండా తల్లిదండ్రులు, ఎస్ఎంసీ సభ్యులు తప్పా ఇతరులను అనుమతించొద్దని ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వడం సరికాదన్నారు. సమస్యలు తెలుసుకొని ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళ్లే హక్కు విద్యార్థి, ప్రజా సంఘాలకు కూడా ఉందన్న విషయం గుర్తించాలన్నారు.

'ప్రారంభోత్సవాలతోనే సరిపెడుతున్న కూటమి'

కళ్యాణదుర్గం రూరల్: కూటమి ప్రభుత్వం పరిశ్రమల ఏర్పాటుకు ప్రారంభోత్సవాలు చేసి, వదిలేస్తోందని, ఉపాధి కల్పించలేని సోలార్ పరిశ్రమ ఏర్పాటు చేస్తే అడ్డుకుంటామని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి గోపాల్ హెచ్చరించారు. ఆదివారం మండలంలోని మానిరేవులో సీపీఐ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ, కళ్యాణదుర్గం మండలంలోని తిమ్మసముద్రం ఇండస్ట్రియల్ పార్క్ ప్రారంభోత్సవాలకే పరిమితం అయిందన్నారు. ఉపాధి లేని సోలార్ ప్రాజెక్టులకు ఏపీఐఐసీకి భూములు కట్టబెడితే రైతులతో కలిసి ప్రతిఘటిస్తామన్నారు. ఉపాధి కల్పించే పరిశ్రమలు వస్తాయని 1100 ఎకరాలు భూమిని ఏపీఐఐసీకి ఇచ్చారని, కూటమి ప్రభుత్వం ఏర్పాటయిన తర్వాత రాష్ట్రం అంధకారంలోకి వెళ్లిందన్నారు. పేరూరు ప్రాజెక్టులకు హంద్రీనీవా నీరు నింపడంతో పాలకులకు చిత్తశుద్ధి లేదన్నారు. పెన్నానదిలో నీరు లేకపోవడంతో భూగర్భ జలాలు తగ్గి పరీవాహక ప్రాంతంలోని రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

డేంజర్ డ్రైవ్

- ద్విచక్ర వాహనాలు నడుపుతూ హల్‌చల్ చేస్తున్న మైనర్లు
- దూసుకొస్తున్న ప్రమాదాలు
- పట్టించుకోని పోలీస్, రవాణాశాఖ అధికారులు
- తల్లిదండ్రుల్లోనూ అవగాహన కల్పించాలంటున్న ప్రజలు

ఉరవకొండ: రానురానూ మోటార్ వాహనాల వినియోగం పెరిగిపోతోంది. ఇంటినుంచి బయటకు వెళ్లాలంటే బైక్ ఉండాల్సిందే.. ప్రస్తుత కాలంలో అంగడి సరుకులు కొనుగోలు చేయడానికో.. కూరగాయలు తీసుకురావడానికో బైక్ అత్యవసరమైపోయింది. పిల్లలను గారాబంగా పెంచుతున్న తల్లిదండ్రులు వారి కోరిక మేరకు ద్విచక్రవాహనాలు కొనివ్వడం.. వారు అతివేగంగా నడుపుతూ కోరి ప్రమాదాలు కొని తెచ్చుకోవడం ఎక్కువయ్యాయి. మైనర్లు నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతుండడంతో వీధుల్లోనూ, రహదారులపైనా నడిచి వెళ్లే అమాయకులు, ఎదురువచ్చే వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.

- ఇటీవల ఉరవకొండకు చెందిన ఓ ప్రైవేట్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ముగ్గురు విద్యార్థులు 42వ జాతీయ రహదారిపై అనంతపురం రోడ్డు వైపు అతి వేగంగా వెళ్తుండగా, ద్విచక్ర వాహనం అదుపు తప్పింది. ఈ ప్రమాదంలో ముగ్గురూ గాయాలపాలయ్యారు. ఇదొక్క సంఘటనే కాదు.. ఉరవకొండ ఆర్టీఓ పరిధిలో ఇలాంటి కేసులు కోకొల్లలు.

లైసెన్స్ లేకుండానే డ్రైవింగ్:

రవాణా చట్టాల ప్రకారం 18 సంవత్సరాల వయసు నిండిన వారికే వాహనాలు నడపడానికి అనుమతి జారీ చేస్తారు. అయితే తల్లిదండ్రులు తమ మైనర్ పిల్లలకు వాహనాలు ఇచ్చి ప్రోత్సహించడంతో ఇటీవల కాలంలో ప్రమాదాలు పెరిగిపోయాయి. కొన్ని సందర్భాల్లో మైనర్లు వాహనాలు నడుపుతుండగా పోలీసులు, రవాణా శాఖ అధికారులు వారిని ఆపి తల్లిదండ్రులకు పిలిచి కౌన్సెలింగ ఇస్తున్నా ఫలితం ఉండడంలేదు. గతంలో విద్యార్థులు సైకిళ్ల పైనే పాఠశాల, కళాశాలలకు వెళ్లే వారు. కొందురు తల్లిదండ్రులు తమ స్థాయిని చెప్పుకోవడానికి పదో తరగతి నుంచే పిల్లలకు బైక్‌లు కొనిస్తున్నారు. ఉరవకొండలో నిత్యం బీజీగా ఉండే 42వ జాతీయ రహదారిపై మైనర్లు ద్విచక్ర వాహనాల్లో వేగంగా ప్రమాదకరంగా దూసుకోపోతుండటం ఆందోళన కలిగిస్తోంది.

పట్టించుకోని అధికారులు:

ద్విచక్ర వాహనాలు నడిపే మైనర్లను గుర్తించి వారిపై కేసులు, జరిమానాలు విధించడం చూస్తు ఉంటాం. అయితే మైనర్లు విచ్చలవిడిగా వాహనాలు నడుతున్నా పోలీసు, రవాణాశాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. మైనర్లు నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతూ రోడ్లపై నడిచి వెళ్తున్న వారిని భయభ్రాంతులకు గురి చేస్తున్నారు.

ఏడాది కాలంలో గుంతకల్లు ఆర్టీఓ పరిధిలోని ఉరవకొండ, గుంతకల్లు నియోజకవర్గాల్లో నమోదయిన కేసులు		
నియోజకవర్గం	నమోదయిన కేసులు	జరిమానా
ఉరవకొండ	4	రూ. 3,000
గుంతకల్లు	6	రూ. 5,000
కళ్యాణదుర్గం ఆర్టీఓ కార్యాలయ పరిధిలోని కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల్లో నమోదయిన కేసులు		
కళ్యాణదుర్గం	8	రూ. 4,000
రాయదుర్గం	8	రూ.4,000


ద్విచక్ర వాహనంపై ప్రమాదకరంగా విన్యాసాలు చేస్తున్న యువకులు


ఉరవకొండలో ఒకే బైకులో నలుగురిని తీసుకెళ్తున్న బాలుడు

అవగాహన కల్పిస్తున్నాం



మైనర్లకు ద్విచక్రవాహనాలు సమకూర్చే తల్లిదండ్రులకు పోలీసు శాఖ తరుపున అవగాహన కల్పిస్తున్నాం. యుక్త వయస్సులో ఉన్న వారు వేగానికి ఇచ్చే ప్రాధాన్యత ప్రాణానికి ఇవ్వడంలేదు. అనుభవ రాహిత్యంతో వారు వేగంగా వాహనం నడపడం వల్ల అనేక రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది.

– మహానంది, సీఐ, ఉరవకొండ అర్బన్

తనిఖీలు చేస్తూనే ఉన్నాం



మోటారు వాహనాల ప్రత్యేక తనిఖీలు చేపట్టి వాహనాలు నడిపే మైనర్లకు కేసులు నమోదు చేసి, జరిమానా విధిస్తున్నాం. కొన్ని సార్లు మైనర్ల తల్లిదండ్రులను పిలిపించుకొని కౌన్సెలింగ్ ఇస్తున్నాం. మైనర్లకు ఎక్కడా డ్రైవింగ్ లైసెన్సులు కూడా ఇవ్వకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. పోలీసు శాఖతో కలిసి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

– రాజాబాబు, ఆర్‌టీఓ, గుంతకల్లు

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో మహాసామ్రాజ్య పట్టాభిషేకం


ఉరవకొండలో నాగుల పురదయ్యస్వామి మహాసామ్రాజ్య పట్టాభిషేకం ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

ఉరవకొండ: ఉరవకొండలో ప్రసిద్ధిగాంచిన పాతపేట ఆంజనేయస్వామి ఆలయం వద్ద వెలసిన నాగుల పురదయ్యస్వామి మహాసామ్రాజ్య పట్టాభిషేకం కార్యక్రమం ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కురుబల్లో అండేల రాజగిరి గోత్రం వంశస్తుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో ఆంజనేయస్వామి ఆలయం వద్ద నుంచి స్వామి ఉత్సవ మూర్తులను భక్తులు తలపై ఎత్తుకొని వీధుల్లో ఊరేగించారు. ఊరేగింపుగా మల్లేశ్వరస్వామి ఆలయానికి చేరుకొని విశేష పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి మహాసామ్రాజ్య పట్టాభిషేకం నిర్వహించారు. అనంతరం గవిమఠం ఆవరణలో గొరవయ్యలు సంప్రదాయ బద్ధంగా నృత్యాలు చేసి, గొరవయ్యల పాలుతాపే కార్యక్రమం నిర్వహించారు.

విద్యుత్ భారం మోపడం సిగ్గుచేటు

రాయదుర్గంటౌన్: ప్రజలపై విద్యుత్ చార్జీల భారం మోపడం సిగ్గుచేటని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మల్లికార్జున విమర్శించారు. విద్యుత్ చార్జీల పెంపు, ట్రూప్ చార్జీల భారం, స్మార్ట్ మీటర్ల బిగింపుపై ఈ నెల 5న వామపక్షాల ఆధ్వర్యంలో విద్యుత్ కార్యాలయాల వద్ద తలపెట్టిన నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ, ఎస్‌ఐలు

డి హీరేహాళ్ (రాయదుర్గం): సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ తెలిపారు. ఆదివారం డి హీరేహాళ్ మండలంలోని చెర్లోపల్లి గ్రామంలో ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది సందర్శించారు. సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, రోడ్డు ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు తప్పక హెల్మెట్ ధరించి, ప్రాణాలు కాపాడుకోవాలన్నారు. ఎవరైనా సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతే వెంటనే 1930 నంబర్‌కు డయల్ చేయాలన్నారు. గ్రామంలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. రస్తా సమస్యకు పరిష్కారం చూపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పరమేష్, గ్రామస్తులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

'సనాతన ధర్మపరిరక్షణలో భాగస్వామ్యం కావాలి'

రాయదుర్గంటౌన్: సనాతన ధర్మ పరిక్షణలో ప్రతి హిందువూ భాగస్వామ్యం కావాలని వీహెచ్‌పీ ప్రాంత సేవ ప్రముఖ్ పోలూరి రామ్మూర్తి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో వీహెచ్‌పీ జిల్లా స్థాయి కార్యవర్గ సమావేశం నిర్వహించారు. అనంతరం వీహెచ్‌పీ రాయదుర్గంశాఖ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగినట్లు వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజేష్ తెలిపారు. అధ్యక్షుడిగా సత్యనారాయణ, కార్యదర్శిగా మాదుగుండే మల్లికార్జున, ఉపాధ్యక్షుడిగా పేర్మి శ్రీనివాసులు, సహ కార్యదర్శిగా సాయిప్రసాద్, కోశాధికారిగా తట్టే నగేష్‌ను ఎన్నుకున్నారు.

బూదగవి సూర్యదేవాలయంలో రిషి మాలధారణ


బూదగవిలో సూర్యదేవుని సన్నిధిలో సవిత్ర వ్రత దీక్ష మాలధారణ చేసిన భక్తులు

ఉరవకొండ: ప్రసిద్ధిగాంచిన బూదగవి సూర్యదేవుడి ఆలయంలో భక్తులు భక్తిశ్రద్ధలతో రిషి మాలధారణ ఆదివారం చేశారు. సూర్యదేవాలయం జ్యేష్ఠాభిషేకం చేసిన పుజ్య గురువులు ఆర్కరిషి మహా గురువు సమక్షంలో భక్తులు పెద్ద సంఖ్యలో సవిత్ర వ్రత దీక్ష మొక్క మాలధారణ ఆచరించారు. ఉదయం సూర్యభగవాన్ మూలవిరాట్‌కు విశేష పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం పుజ్య గురువు ఆర్కరిషి మాట్లాడుతూ జిల్లాలో కరువు కాటకాలు దూరమై, ప్రతి గ్రామం పచ్చగా ఉండాలని, సంపూర్ణంగా పంటలు చేతికందాలని మాలధారణ చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు చిరంజీవి, సుధాకర్ తదితరులు స్వామిని సన్మానించి, జ్ఞాపిక అందజేశారు.

తప్పిన పెనుప్రమాదం


శెట్టూరు ఫారెస్ట్‌లో బోల్తా పడిన లారీ

శెట్టూరు: మండల కేంద్రానికి సమీపంలో ఉన్న ఫారెస్ట్‌లో విద్యుత్ స్తంభాన్ని ఢీకొని లారీ బోల్తా పడింది. ఆదివారం తెల్లవారుజామున కళ్యాణదుర్గం నుంచి శెట్టూరువైపు వెళ్తుండగా ఫారెస్ట్‌లో మలుపు వద్ద లారీ విద్యుత్‌స్తంభాన్ని ఢీకొనగా, పక్కనే ఉన్న మూడు స్తంభాలు కిందపడిపోయాయి. విద్యుత్ వైర్లు తెగి కిందపడిపోయాయి. సిమెంట్ బస్తాలతో వెళ్తున్న లారీ రోడ్డ ప్రక్కగా బోల్తాపడిపోయింది. కాగా లారీ స్తంభాన్ని ఢీకొన్న సమయంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. విద్యుత్ సిబ్బంది స్తంభాలను మరమ్మతులు చేయించారు.

వర్షం కోసం శ్రీమద్విరాట్ పర్వం పఠనం


వెంకటాద్రిపల్లిలో శ్రీమద్విరాట్ పర్వ పారాయణం చేస్తున్న పండితులు

బొమ్మనహాళ్: మండలంలోని వెంకటాద్రిపల్లిలో పండితులు, గ్రామస్తులు ఆదివారం శ్రీమద్విరాట్ పర్వం పఠనం చేశారు. వర్షాలు సకాలంలో కురవాలని గత నెల 29 నుంచి శ్రీమద్విరాట్ పర్వం పఠనం చేస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

జీడిపల్లి వద్ద హెచ్చరిక బోర్డులు


జీడిపల్లి రిజర్వాయర్ మరువ వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

బెళుగుప్ప: మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్ వద్ద తహసీల్దార్ అనిల్‌కుమార్ నీటి ప్రవాహ హెచ్చరిక బోర్డులను ఆదివారం ఏర్పాటు చేయించారు. ప్రస్తుతం జీడిపల్లి రిజర్వాయర్‌కు శ్రీశైలం ప్రాజెక్టు నుంచి హంద్రీనీవా కాలువల ద్వారా కృష్ణా జలాలు వచ్చి చేరడంతో పూర్తిగా నిండి ఉధృతంగా మరువ పారుతోంది. సుమారు 2,200 క్యూసెక్కుల నీరు మరువ ద్వారా పీఏబీఆర్ ప్రాజెక్టుకు చేరుతోంది. దీంతో మరువ వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసి, రిజర్వాయర్ వద్ద ఈతకు ఎవరూ వెళ్లరాదని, వాహనాలను నిలుపరాదని సూచిస్తూ బోర్డులను ఏర్పాటు చేశారు.

సంబరంగా స్నేహితుల దినోత్సవం


ఉరవకొండలో కలిసిన పూర్వ విద్యార్థులు

ఉరవకొండ: స్థానిక ఎస్‌కే ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2001-02 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకొని సమ్మేళనమయ్యారు. 23 ఏళ్ల తర్వాత చిన్ననాటి స్నేహితులను కలుసుకొని జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు.

పూర్వ విద్యార్థుల అన్నదానం

ఉరవకొండ: స్థానిక ఎస్‌కే ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1990-91 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉరవకొండలోని విఠల్ రుక్మిణీ వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. పాలు, పండ్లు పంపిణీ చేశారు. పూర్వ విద్యార్థులు బీఆర్ హరి, వడ్డే రమేష్‌బాబు మాట్లాడుతూ స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకొని పూర్వ విద్యార్థులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

రేపు సామాజిక తనిఖీ ప్రజావేదిక

గుమ్మఘట్ట: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 5న బహిరంగ ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రామకృష్ణ , ఏపీఓ సురేష్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉపాధిహామీ పథకంలో భాగంగా మండలంలోని అన్ని పంచాయతీల్లో 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31 వరకు జరిగిన వివిధ పనులపై గత నెల 27 నుంచి ఈనెల 2 వరకు సామాజిక తనిఖీ ప్రజావేదిక బృందం గ్రామసభలు నిర్వహించింది. అనంతరం క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేసింది. ప్రజావేదికలో సామాజిక తనిఖీ ఆడిట్ చేసిన నివేదికలను వెల్లడించనున్నారు.